

బంగారపేట పురసభ అధ్యక్షుడిగా గోవింద

బంగారపేట, ఆగస్టు 19: బంగారపేట పురసభ అధ్యక్షుడిగా గోవింద, ఉపాధ్యక్షురాలిగా చంద్రవాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పురసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు సోమవారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి గోవింద, ఉపాధ్యక్ష స్థానానికి చంద్రవాణి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి తహసీల్దార్ వెంకటేశప్ప ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి మాట్లాడుతూ పురసభ మూడో అవధికి అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు రిజర్వేషన్ ప్రకటించగా అధ్యక్షస్థానం ఎస్సీ అభ్యర్థికి, ఉపాధ్యక్షస్థానం జనరల్ మహిళకు కేటాయించారన్నారు.

కాంగ్రెస్ నిరసన



ఫ్రీడంపార్కులో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రుల నిరసన

- 31 జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీలు
- పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు
- బాగల్కోటెలో ఇద్దరు కార్యకర్తల ఆత్మహత్యాయత్నం
- తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిక
- పోటీగా బీజేపీ ఆందోళన



గవర్నర్, బీజేపీ, జేడీఎస్ నాయకుల మాస్కులతో కాంగ్రెస్ నిరసన

బెంగళూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడంతో గవర్నర్ తీరును ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సోమవారం కాంగ్రెస్ నిరసనల హోరు కొనసాగించింది. రహదారుల దిగ్బంధంతోపాటు 31 జిల్లా కేంద్రాలలోనూ వేలాదిమంది ర్యాలీ చేయడంతో ప్రతిచోటా ట్రాఫిక్ స్తంభించింది. బెంగళూరు ఫ్రీడంపార్కులో జరిగిన నిరసనకు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అధ్యక్షత వహించగా మంత్రులు రామలింగారెడ్డి, జార్జ్, సతీశ్‌జార్కిహొళి, జమీర్ అహ్మద్, కృష్ణబైరేగౌడ, ఈశ్వర్‌ఖండ్రె, రహీంఖాన్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సౌమ్యరెడ్డి, ఎమ్మెల్సీలు పుట్టణ్ణ, వెంకటేశ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ నవరంగి నకిలీ స్వామి, కుమారస్వామిపై ఎందుకు గవర్నర్ చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తమపై ఎందుకు కోపమని అన్నారు. రానున్న పదేళ్ల కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని, మీ కుట్రలకు భయపడేది లేదని తేల్చిచెప్పారు. కుమారస్వామి సీఎంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆయనతోపాటు శశికళ జొల్లె, మురుగేశ్ నిరాణి, జనార్దన్‌రెడ్డిని ఎందుకు ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు పదిజన్మలు ఎత్తినా కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చలేవన్నారు. సీఎం రాజీనామా ఇచ్చే ప్రశ్నే లేదన్నారు. మంత్రాలకు మామిడికాయలు రాలవన్నారు. సిద్దరామయ్యకు మద్దతుగా డీకే శివకుమార్ లేదా రాష్ట్రానికి చెందిన మంత్రులు మాత్రమే కాదని దేశంలోని 'ఇండియా' కూటమి అంతా వెన్నంటి ఉంటుందన్నారు. మైసూరులో ఎమ్మెల్యే తన్వీర్‌సేఠ్ సారథ్యంలో వేలాదిమంది నిరసనలో పాల్గొన్నారు. బాగల్కోటె జిల్లాలో నిరసనలు సాగుతున్న వేళ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన నాగరాళ్ నివాసి ద్యావప్ప, బీళగి తాలూకా గిరిసాగర నివాసి హనుమంత్‌ను హుటాహుటిన స్థానిక ఆసుపత్రికి తరలించారు. బెళగావిలో లక్ష్మీ హెబ్బాళ్కర్ సారథ్యంలో ఆందోళన జరగగా మంగళూరులో ఐవాన్ డిసౌజాతోపాటు పలువురు సారథ్యంలో ఆందోళన సాగాయి. రాష్ట్రమంతటా నిరసనల హోరు కొనసాగింది. మండ్యలో మంత్రి చలువరాయస్వామి, చామరాజనగరలో మంత్రి వెంకటేశ్ నేతృత్వంలో నిరసనలు కొనసాగాయి. కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు అభిమానులు, కురబ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గవర్నర్ నిర్ణయంపై తన తల్లి న్యాయపోరాటం చేస్తారని ఎమ్మెల్సీ డాక్టర్ యతీంద్ర తెలిపారు. మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ తన తల్లి పార్వతి న్యాయ పోరాటం చేస్తారని వెల్లడించారు.




బాగల్కోటెలో నిప్పు పెట్టుకుని గాయపడిన యువకుడు

పోటాపోటీగా బీజేపీ నిరసన

ముఖ్యమంత్రి సిద్దరామయ్య పదవికి రాజీనామా చేయాలని కోరుతూ విధానసౌధ ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రతిపక్షనేత ఆర్ అశోక్ నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం సదానందగౌడ మాట్లాడుతూ ప్రాథమికంగా ఆధారాలు లభించినందున గవర్నర్ విచారణకు ఆదేశించే సంప్రదాయం ఉందని, అందులో తప్పేం ఉందని ప్రశ్నించారు. ముడా అవినీతిని చట్టపరంగా ఎదుర్కోవాలిగానీ ఇలా సాకులు, ఆందోళనలు సరికాదని హితవు పలికారు. విజయేంద్ర మాట్లాడుతూ సీఎం పదవికి రాజీనామా చేసి న్యాయపోరాటం చేసుకోవచ్చు అన్నారు. ముడా అవినీతిలో సాక్ష్యాలు లేకుండానే ప్రాసిక్యూషన్‌కు అనుమతిలు ఇస్తారా..? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ లూటీలకు పాల్పడుతోందని మండిపడ్డారు. 5.95 లక్షల విలువైన భూమికి రూ.62 కోట్ల పరిహారం కోరడం సమంజసమేనా అని ప్రతిపక్షనేత అశోక్ ప్రశ్నించారు.

విధానసౌధ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద బీజేపీ ఆందోళన





మీడియాతో సీఎం సిద్ధరామయ్య

సిద్దూకు తాత్కాలిక ఉపశమనం

- రెండు రోజులుగా ఇంటిపట్టునే ముఖ్యమంత్రి
- సుప్రీంకోర్టు న్యాయవాదులతో సుదీర్ఘ మంతనాలు

బెంగళూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) ఇంటి స్థలాల వివాదంలో మూడు రోజులుగా సాగుతున్న రాజకీయ ఉత్కంఠలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు తాత్కాలిక ఉపశమనం లభించింది. రెండు రోజులుగా ఇంటిపట్టునే గడిపిన సీఎం హైకోర్టు ఆదేశాలతో ఊరట పొందారు. ముడా వివాదంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ శనివారం అనుమతులు ఇచ్చారు. అప్పటి నుంచి రాజకీయ అల్లకల్లోలం మొదలయింది. ఆ వెంటనే ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ అందుబాటులో ఉండే మంత్రులతో అత్యవసరంగా మీడియా సమావేశం నిర్వహించడం, సాయంత్రం అత్యవసర కేబినెట్ భేటీకి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈలోగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రమంతటా నిరసనల హోరు సాగించింది. ఆదివారం సీఎం సిద్దరామయ్య అధికారిక నివాసంలో పలువురు మంత్రులు, ఆప్తులు, న్యాయనిపుణులతో సమాలోచనలు జరిపారు. సోమవారం ప్రతిక్షణం ఉత్కంఠగా గడిచింది. గవర్నర్ ప్రాసిక్యూషన్ అనుమతులను వ్యతిరేకిస్తూ సీఎం సిద్దరామయ్య తరఫున హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసును అత్యవసరంగా విచారణ జరపాలని ఆయన తరఫు న్యాయవాదులు కోరారు. అందుకు హైకోర్టు ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ ఎం. నాగప్రసన్న అత్యవసర విచారణకు చీఫ్ జస్టిస్ అనుమతులు కావాలని సూచించారు. ఆ తర్వాత మధ్యాహ్నం విచారణ జరిపేలా ఆదేశించారు. విచారణ వేళ సీఎం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వి వాదనలు వినిపించారు. మంత్రివర్గ తీర్మానాన్ని గవర్నర్ స్వీకరించలేదని, పైగా విచారణలు పూర్తయిన పలు వివాదాలకు ప్రాసిక్యూషన్‌కు ఇవ్వకుండా ఆత్రుతగా సీఎంపై అనుమతులు ఇచ్చారని వాదించారు. గవర్నర్ తరఫున న్యాయవాది తుషార్ మెహతా వాదిస్తూ.. ముఖ్యమంత్రి నియమించుకున్నవారే మంత్రులుగా ఉంటారని, వారు ఏకపక్షంగా సీఎంకు మద్దతు ఇస్తారని, వ్యతిరేకించేవారు ఉండరని వివరించారు. మరోవైపు గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన టీజే అబ్రహం, ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ తరఫున ముగ్గురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఇదే సందర్భంలో సీఎం తరఫు న్యాయవాది ఈనెల 29వరకు గడువు ఇవ్వాలని కోరారు. అందుకు హైకోర్టు సమ్మతించింది. దీంతో ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు పదిరోజులపాటు ఊరట లభించింది. గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడంతో ఇప్పటికే మైసూరు లోకాయుక్తలో స్నేహమయి కృష్ణ ఫిర్యాదు చేశారు. మరోవైపు మిగిలిన ఇద్దరు ప్రజా ప్రతినిధుల కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. దీంతో ఈనెల 29వరకు ప్రజాప్రతినిధుల కోర్టు కూడా తదుపరి చర్యలు తీసుకోరాదని ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టునుంచి తాత్కాలిక ఉపమశమనం లభించడంతో కాంగ్రెస్ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

న్యాయవాదులతో సీఎం మంతనాలు

హైకోర్టులో వాదనలు వినిపించేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా వచ్చిన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వితో ఓ హోటల్‌లో ముఖ్యమంత్రి సిద్దరామయ్య మంతనాలు జరిపారు. సాయంత్రం నుంచి రాత్రి దాకా అక్కడే ఉన్నారు. సోమవారం బళ్లారి, మంత్రాలయం పర్యటనలు వాయిదా వేసుకున్న ముఖ్యమంత్రి బుధవారం తన షెడ్యూల్‌ను పునరుద్ధరించుకున్నారు. బుధవారం విజయపుర జిల్లాలోని ఆల్మట్టి జలాశయానికి వాయనం సమర్పించే కార్యక్రమంలో పాల్గొననున్నారు.

నేను తప్పు చేయలేదు : సీఎం

ఓవైపు కోర్టు విచారణతో ఉత్కంఠలో ఉన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం చిత్రకళాపరిషత్‌లో ఫొటో జర్నలిస్టులు ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రిట్ పిటిషన్‌లో ఇంటీరియం రిలీఫ్ కోరామన్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో తాను ఏ తప్పూ చేయలేదన్నారు. బీజేపీ నేతలు రాజీనామా డిమాండ్ చేస్తున్నారని, వారిది రాజకీయ కుట్ర తప్ప మరో కోణం లేదన్నారు. రాజకీయంగా తనను ముగించాలన్నదే వారి లక్ష్యం అన్నారు. తాను న్యాయపోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

ఆపద్బాంధవుడు కన్నయ్య



కన్నయ్యనాయుడు

- ఆయన కృషితో 30 టీఎంసీల నీరు ఆదా
- టీఎంసీ నీటితో 10 నుంచి 12 వేల ఎకరాల్లో పంటల సాగు
- కొనియాడుతున్న రైతులు



తుంగభద్ర జలాశయం

బళ్లారి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం క్రస్ట్‌గేటు తెగిపోవడంతో ఇక నీరంతా సముద్రం పాలు కావాల్సిందేనని అందరూ భావించారు. రైతుల పరిస్థితి మరీ ఆందోళనకరంగా తయారయింది. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలోనే జలాశయం పూర్తికావడంతో ఇక రెండు పంటలకు ఎలాంటి ఢోకా లేదని రైతులు సాగుకు సిద్ధమవుతుండగా పచ్చివెలక్కాయపడినట్లయింది. ఆపద్బాంధవుడిలా వచ్చిన క్రస్ట్‌గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు కృషితో నీరు సముద్రం పాలుకాకుండా నిలువరించగలిగారు. ఆయన ఒక్కడి కృషి వేలాది రైతు, శ్రామిక కుటుంబాలకు జీవం పోసింది. తెగిపోయిన 19వ క్రస్ట్‌గేటుకు స్టాప్‌లాగ్ ఎలిమెంట్ విజయవంతంగా అమర్చడంతో 30 టీఎంసీల నీరు నదికి వృథాగా వెళ్లకుండా కాపాడారు. కన్నయ్యనాయుడు కృషితో రెండు రాష్ట్రాల రైతులకు వందలాది కోట్ల పంట పండించేలా చేసింది. తుంగభద్ర జలాశయం కింద కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల్లో 21 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. బచావత్ అవార్డు ప్రకారం 2024 నీటి లభ్యతను అధికారులు ముందే అంచనా వేశారు. 212 టీఎంసీలు నీరు డ్యాంకు లభ్యత అవుతుందని, ఇందులో 172 టీఎంసీలు వాడకానికి వస్తాయని తేల్చారు. ఈ 172 టీఎంసీలలోనే పంట కాలువలు, తాగునీరు, పరిశ్రమలకు కేటాయింపులు జరిగాయి. అనుకున్న సమయంలో కన్నా ముందే వర్షాలు బాగా కురిసి తుంగభద్ర డ్యాం పొంగిపొర్లింది. అనుకోని విపత్తు ఎదురై 19వ క్రస్ట్ గేటు తెగిపోయింది. దాదాపు డ్యాం నుంచి 30 టీఎంసీల నీరు వృథాగా నదికి వెళ్లిపోయింది. క్రస్ట్ గేటు అమర్చాలంటే డ్యాంలో ఉండే నీరు బెడ్‌లెవెల్ వరకూ వదిలేయాలి. అంటే మొత్తం గేట్లు ఎత్తి డ్యాంలో ఉండే 71 టీఎంసీల నుంచి 40 టీఎంసీల వరకూ నిల్వ చేయాలి. దీంతో 30 టీఎంసీల నీరు వృథా అవుతాయి. డ్యాంలో నీరు ఉండగానే స్టాప్‌లాగ్ ఎలిమెంట్ బిగించేందుకు కన్నయ్యనాయుడు ప్రణాళిక రచించారు. పారే నీటిలో స్టాప్‌లాగ్ ఎలా అమర్చుతారని అందరూ ఆశ్చర్యపోయారు. ఏకంగా ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు కూడా ఇది సాధ్యమా అని అనుమానించారు. కానీ అందరి అనుమానాలను పటాపంచలు చేశారు. వృథా కాకుండా 30 టీఎంసీల నీటిని ఆదా చేశారు. ఒక టీఎంసీ నీరు సరాసరి 10 నుంచి 12 వేల ఎకరాలకు అందుతాయి. అంటే దాదాపు 30 లక్షల నుంచి 36 లక్షల ఎకరాలకు నీరు అందుతాయి. ఎకరాలో పంట దిగుబడి వరి అయితే 35 బస్తాలు, అదే ఇతర పంటలు, మిరప, పత్తి ఎకరాకు రూ. 20 వేల దాకా లాభం వస్తుంది. ఇలా మొత్తం కోట్లాది రూపాయల పంటపండుతుంది. ఆయన ఆలోచన, శ్రమ రెండు రాష్ట్రాలకు తాగునీటితో పాటు సాగునీరు అందించింది. అందుకే ఆయన రైతుల పాలిట ఆపద్బాంధవుడు అయ్యారు. అంతే కాకుండా రెండు రాష్ట్రాలకూ ఆహార కొరత నుంచి తప్పించారు. కన్నయ్యనాయుడు కృషిని ప్రతి రైతూ తలచుకుంటున్నాడు.

ఆకట్టుకున్న ఛాయాచిత్ర ప్రదర్శన



ఉత్సాహంగా ఫొటోలు తీస్తున్న సీఎం

బెంగళూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకుని సోమవారం బెంగళూరు ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని చిత్ర కళా పరిషత్ లో ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభించారు. సీఎం స్వయంగా కొన్ని ఫొటోలు తీయడం అందరినీ ఆకట్టుకుంది. వివిధ పత్రికల ఫొటోగ్రాఫర్లు భిన్నమైన కోణాలలో తీసిన ఫొటోలు ఆకట్టుకున్నాయి. ప్రజా పోరాటాలు, వివిధ నాయకుల హావభావాలు, ఉత్సవాలు ఇతరత్రా కార్యక్రమాల ఫొటోలు వందకుపైగా ఎగ్జిబిషన్‌లో ఉన్నాయి. సోమవారం ప్రారంభమైన ప్రదర్శన మూడు రోజులపాటు కొనసాగనుంది.

స్టాప్‌లాగ్ ఎలిమెంట్ ఓ అద్భుతం

- కన్నయ్యనాయుడు శ్రమ చిరస్మరణీయం
- జలాశయం మళ్లీ నిండుతుంది
- ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు

బళ్లారి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం క్రస్ట్‌గేటు ప్రమాదం వల్ల నీరు వృథాగా వెళ్లకుండా కన్నయ్యనాయుడు చేసిన స్టాప్‌లాగ్ ఎలిమెంట్ పనులు దేశంలోనే అత్యద్భుతమని ఆంధ్రప్రదేశ్‌లోని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కొనియాడారు. సోమవారం హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో కొట్టుకుపోయిన 19వ క్రస్ట్‌గేటు స్థానంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎలిమెంట్స్‌ను పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం మళ్లీ నిండుతుందనే విశ్వాసం ఉందన్నారు. ఈ డ్యాం ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలోని అనేక జిల్లాలకు జీవనాధారంగా ఉందన్నారు. డ్యాంలో 105 టీఎంసీలు నీరు నిండడంతో ఇక పంటల సాగుకు, తాగు నీటికీ ఏమాత్రం ఢోకా లేదనుకున్నామని, క్రస్ట్ గేటు కొట్టుకుపోయి నీరు వృథాగా వెళ్లిపోవడంతో ఆందోళన చెందామన్నారు. నీరు ఉండగానే స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్ అమర్చి కన్నయ్యనాయుడు వృథా కాకుండా కాపాడారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని కన్నయ్యనాయుడుతో మాట్లాడి ఎలాగైనా నీటిని నిలపాలని కోరారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో డ్యాం నిర్వహణ కోసం ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. డ్యాంకు ప్రమాదం జరిగిన వెంటనే ఏపీ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేశామన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ కన్నయ్యనాయుడుతో సీఎం చంద్రబాబుతో పాటు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కూడా ప్రత్యేక శ్రద్ధ చూపి పనులు చేయించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి తిమ్మరాజు, మురళీ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.58	1,627.78
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	37,687	587
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,275	9,947
సామర్థ్యం (టీఎంసీలు)	75.13	85.96

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కంప్లి, ఆగస్టు 19: కురుగోడు తహసీల్దార్‌గా సోమవారం నరసప్ప బాధ్యతలు స్వీకరించారు. గతంలో బెట్టకల్ తహసీల్దార్‌గా పనిచేసిన ఆయన కురుగోడుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తా మన్నారు. ఇక్కడ పని చేస్తున్న రాఘవేంద్రను బెంగళూరుకు బదిలీ చేశారు. బదిలీ అయిన తహసీల్దార్ రాఘవేంద్ర నరసప్పను అభినందించారు.

ఎస్సీ, ఎస్టీ గ్రాంట్స్ పూర్తి స్థాయిలో ఖర్చుచేయాలి: డీసీ

బళ్లారి సిటీ, ఆగస్టు 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేయాలని డీసీ ప్రశాంత్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా నూతన పాలనా భవనంలో ఎస్సీ, ఎస్టీల ప్రగతి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య, వ్యవసాయ శాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖలు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించిన గ్రాంటును సరైన ప్రణాళిక రూపొందించి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఎస్సీ, ఎస్టీ పథకాలపై విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు. స్థానిక ఎమ్మెల్యేల సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక తర్వాగా చేపట్టాలన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు



మాట్లాడుతున్న డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

అర్హులకు త్వరితగతిన లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆగస్టు నెలాఖరులోగా బకాయి నిధులన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకలు మల్లికార్జున మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల సబ్‌లోకేషన్(ఎస్‌సీఎస్‌పీ)పథకం కింద జూలై నెలాఖరు వరకు వివిధ శాఖల్లో మొత్తం రూ.7003.99 లక్షల గ్రాంట్లు విడుదలయ్యాయన్నారు. ఇందులో రూ. 5522.28 లక్షలు ఖర్చు చేయగా 79శాతం పురోగతి సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా షెడ్యూల్డ్ తెగల సబ్ డిస్ట్రిబ్యూషన్ (టీఎస్‌పీ) పథకం కింద 8206.72లక్షలు విడుదల చేశామని, ఇందులో రూ. 7531.64 లక్షలు ఖర్చు చేశామని, 92 శాతం ప్రగతి సాధించామని తెలిపారు. కాగా, పట్టణాభివృద్ధి శాఖ, కేఆర్ఐటీఎల్, పీడబ్ల్యూడీ ద్వారా చేపట్టిన పనుల అభివృద్ధిని సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ అధికారి దివాకర్, మహిళాశిశు అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వంతెనపై వెళ్తున్న వాహనాలు

రైట్..రైట్..!

20 రోజుల తర్వాత తెరుచుకున్న కంప్లి వంతెన

కంప్లి, ఆగస్టు 19 : ఎట్టకేలకు 20 రోజులకు పైగా మూతపడ్డ కంప్లి, గంగావతి వంతెన సోమవారం తెరుచుకుంది. నీటి ప్రవాహం తగ్గడంతో అధికారులు ద్విచక్ర వాహనాలు, ఆటో, కార్ల ప్రయాణానికి అనుమతిచ్చారు. వంతెనపై ప్రయాణానికి అనుమతి వ్వడంతో ప్రజలు, ప్రయాణికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. భారీ వాహనాలకు అనుమతించేది లేదని అధికారులు తెలిపారు. వంతెనను పూర్తిగా పరీక్షించిన అనంతరం అన్ని వాహనాలను అనుమతిస్తామని రహదారి శాఖ అధికారి విశ్వనాథ్ పేర్కొన్నారు.

బళ్లారిలో భారీ వర్షం



బస్టాండ్ సమీపంలో..



రాయల్ బస్టాండు వద్ద వర్షపునీటిలో వెళుతున్న వాహనాలు

బళ్లారి సిటీ/రూరల్, ఆగస్టు 19: నగరంలో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. గంట పాటు కురిసిన వర్షంతో నగరంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. రాయల్ సర్కిల్, దుర్గమ్మ గుడి, అండర్ బ్రిడ్జి, సత్యనారాయణ పేట, అండర్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. హగరి, మొకా తదితర ప్రాంతాల్లో సైతం ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రివరకు జల్లులతో కూడిన వర్షం కురుస్తూనే ఉంది.



చెరువులా మారిన పీడీహళ్లి స్కూలు ఆవరణ



దుర్గమ్మగుడి సర్కిల్లో...



వాననీటితో రాజకాలువ

గవర్నర్‌పై కాంగ్రెస్ గరం గరం

● సీఎంపై ప్రాసిక్యూషన్ అనుమతికి వ్యతిరేకంగా నిరసనలు ● రాజీనామా ప్రసక్తే లేదంటున్న నేతలు



బళ్లారి గడిగచెన్నప్ప సర్కిల్లో నిరసనలో కాంగ్రెస్ నాయకులు



రాయచూరులో..

బళ్లారి సిటీ, ఆగస్టు 19: ముఖ్యమంత్రి సిద్దరామయ్య పై ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించడం ప్రజాస్వామ్య రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో గవర్నర్‌కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. గాంధీభవన్‌లో ఆపార్టీ నగర జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ ఆధ్వర్యంలో గడిగ చెన్నప్ప సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. పార్టీ నాయకులు , కార్యకర్తలు సర్కిల్ బంద్ నిర్వహించి గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్, ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలను దహనం చేశారు. నిరసనలో రాజ్యసభ సభ్యుడు నాసిక్ హుస్సేన్ మాట్లాడుతూ సీఎం సిద్దరామయ్య రాజీనామా చేసే ప్రసక్తే లేదన్నారు. గవర్నర్‌ను ఉపయోగించుకుని బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి మాట్లాడుతూ సిద్దరామయ్య ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగడం ఖాయమన్నారు. కంప్లి ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ సిద్దరామయ్య లాంటి నాయకుడు దొరకడని, అలాంటి నాయకుడిపై బీజేపీ కుట్రలు పన్నుతుందన్నారు. అనంతరం డీసీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి గవర్నర్‌పై చర్యలు తీసుకోవాలని ఏడీసీ మహ్మద్ జుబేరా ద్వారా రాష్ట్రపతికి వినతి పత్రం అందజేశారు. నిరసనలో మేయర్ ముల్లంగి నందీశ్, ముండ్రగి నాగరాజు, బుడా అధ్యక్షుడు ఆంజనేయులు, పాలికె సభ్యులు గాదెప్ప, వివేక్, గ్రామీణ జిల్లాధ్యక్ష శివయోగి, హుమాయూన్‌ఖాన్, మానయ్య, శివరాజ్ హెగడె, వెంకటేశ్, బోయపాటి విష్ణు, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

తోరణగల్లు: ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై గవర్నర్ చర్యలను ఖండిస్తూ ఎంపీ సభ్యులు తుకారామ్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా హోస్పేటలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు లత, మాజీ ఎమ్మెల్యే పరమేశ్వరనాయక్, విజయనగరం జిల్లా కాంగ్రెస్ సమితి అధ్యక్షులు సిరాజ్ షేక్, రాణి సంయుక్త, కేపీసీసీ జనరల్ సెక్రెటరీ వివిధ సంఘాల ప్రతినిధులు సమితి పదాధికారులు పాల్గొన్నారు.

రాయచూరు : సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం నగరంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి బసవేశ్వర సర్కిల్ మీదుగా జిల్లాధికారి కార్యాలయం వరకు సాగిన ర్యాలీలో జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నిరసన కార్యక్రమానికి నేతృత్వం వహించిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటీల్, జిల్లాకు చెందిన చిన్న నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసరాజుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయాలని గవర్నర్ అనుమతించడం వెనక కేంద్ర ప్రభుత్వం కుట్ర దాగి ఉందని మంత్రి ఆరోపించారు.



మాట్లాడుతున్న ఎంపీ తుకారామ్

కురుబ సంఘం నిరసన

సీఎంపై గవర్నర్ చర్యలను ఖండిస్తున్నట్లు జిల్లా కురుబ సంఘం నాయకులు పేర్కొన్నారు. జిల్లా, తాలూకా, నగర కురుబ సంఘం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలువురు కురుబ సంఘం నాయకులు ర్యాలీలో పాల్గొన్నారు.



డీసీ కార్యాలయం ముందు నిరసనలో విద్యార్థులు, వైద్య సిబ్బంది

వైద్యురాలి హత్యను ఖండిస్తూ నిరసన

బళ్లారి సిటీ, ఆగస్టు 19: కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై కిరతకంగా అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మహిళలు ధ్వజమెత్తారు. సోమవారం నగరంలో నిరసన చేపట్టిన ఆల్‌ఇండియా ఉమెన్స్ కల్చరల్ ఆర్గనైజేషన్(ఏఐఎంఎస్ఎస్), ఏఐడీవైఓ, ఆల్‌ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు రాష్ట్రపతికి జిల్లా కలెక్టర్ సిబ్బంది ద్వారా వినతి పత్రాన్ని సమర్పించారు. నిరసనలో ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.మంజుల మాట్లాడుతూ వైద్యురాలిని హత్య చేసిన ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. అధికారులు, వెంటనే స్పందించక పోగా, నేరగాళ్లతో కలిసి వారిని కాపాడే ప్రయత్నం చేశారన్నారు. ఇలాంటి ఘటనలకు కారణమైన అశ్లీలత, ఇంటర్నెట్, వెబ్‌సైట్లు, మద్యం, డ్రగ్స్‌ను అరికట్టాలన్నారు. వైద్యులకు, నర్సింగ్ విద్యార్థులకు భద్రత కల్పించాలన్నారు. నిరసన కార్యక్రమంలో కే.ఈరన్న, ఐడీఎస్ జిల్లాధ్యక్షులు ఈశ్వరీ, పంపాపతి, గిరిజ, జగదీశ్, రవికిరణ్, అభిలాష్, శాంతి, విద్య, ఉమ, అనుపమ, నిహారిక, ప్రమోద్ , సిద్దు తదిరులు పాల్గొన్నారు.

రేణుకాయల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజ

సిరుగుప్ప, ఆగస్టు 19 : రేణుకా ఎల్లమ్మ దేవి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠలను భక్తులు ఘనంగా నిర్వహించారు. హళేకోట గ్రామంలో సోమవారం ప్రతిష్ఠా కార్యక్రమంలో ఎమ్మెల్యే బీఎం నాగరాజ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, గణేష్, రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి: డీహెచ్‌ఓ

బళ్లారి సిటీ, ఆగస్టు 19: గర్భిణులు ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి రమేశ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని బండిహట్టి ప్రాంతంలోని ఓ గర్భిణీ ఇంటికి వెళ్ళి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులు నిరంతరం రక్తపరీక్ష చేయించుకోవాలని, ప్రభుత్వాసుపత్రిలో ప్రసవానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రసవం అయిన 45రోజుల పాటు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా వైద్యులను సంప్రదించాలన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే ఎలాంటి సమస్యలు రావన్నారు. మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. ఆడపిల్లకు 18ఏళ్ల నిండకముందే పెళ్ళి చేస్తే ప్రసవ సమయంలో ఇబ్బంది తప్పదన్నారు. 108 ఫోన్ చేస్తే తమ ఇంటి వద్దకే అంబులెన్స్ పంపి వైద్య చికిత్స అందజేస్తామన్నారు. ఈసందర్భంగా జిల్లా ఆంటువ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ అబ్దుల్లా, డాక్టర్ కాళీప్రసాద్, జిల్లా ఆరోగ్య విద్యాశాఖాధికారిలో ఈశ్వర్ దానప్పనవర్ దానకుమార్, జిల్లాఆరోగ్య విద్యాశాఖాధికారి ఈశ్వర్ దానప్పనవర్ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

‘స్టాప్‌లాగ్’ కార్మికులకు మాజీ ఎమ్మెల్యే ప్రశంసలు



కార్మికులతో మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి

బళ్లారి సిటీ, ఆగస్టు 19: తుంగభద్ర జలాశయం 19వ గేటు వద్ద స్టాప్‌లాగ్ ఏర్పాటులో కార్మికుల కృషి అమోఘమని మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్ రెడ్డి ప్రశంసించారు. సోమవారం టీబీ డ్యామ్‌ను సందర్శించిన ఆయన నూతనంగా ఏర్పాటు చేసిన స్టాప్‌లాగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ నీరు ప్రవహిస్తున్న సమయంలోనూ మరమ్మతులు చేపట్టడంలో నిపుణుల కృషి అభినందనీయమన్నారు. ఆపరేషన్ బృందానికి నాయకత్వం వహించిన ఇంజనీర్ కన్నయ్య నాయుడుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. స్టాప్ లాగ్‌గేట్ ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి అని, ఇది ప్రతి ఒక్కరూ సంతోషించదగ్గ విషయమన్నారు. పగలు,రాత్రి అన్న తేడా లేకుండా చేపట్టిన కార్మికుల కృషితోనే 72టీఎంసీల నీరు మిగిలిందన్నారు. రైతులు, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట కార్పొరేటర్లు శ్రీనివాస్ మోత్కార్, బీజేపీ ప్రముఖులున్నారు.

హోసూరు జోన్

పడిపోయిన కొత్తిమీర ధర

● గిట్టుబాటు కాక పొలాల్లోనే వదిలేస్తున్న రైతులు



పొలంలోనే వదిలేసిన కొత్తిమీర పంట

హోసూరు, ఆగస్టు 19: కొత్తిమీర ధర పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హోసూరు ప్రాంతంలో 2వేల ఎకరాలకు పైగా రైతులు క్యారెట్, బీన్స్, ముల్లంగి, కొత్తిమీర, పుదీనా, టమోటా, క్యాబేజీ, బచ్చలికూరను సాగు చేస్తున్నారు. అయితే రాయకోట, శూలగిరి, ఉద్దనపల్లి, తళి, అంచెట్టి, తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో కొత్తిమీర సాగు చేస్తున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న కొత్తిమీరకు మార్కెట్‌లో సరైన ధర లభించకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ప్రస్తుతం హోసూరు రైతుబజారుల్లో కొత్తిమీర కట్ట రూ.5కు విక్రయిస్తున్నారు. తోట నుంచి కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. అమ్మకాలు లేకపోవడంతో కొత్తిమీర మొక్కలు పెరిగి పెద్దవై కుళ్లిపోతున్నాయి. ధరలు లేకపోవడంతో రైతులు కొత్తిమీరను పొలాల్లోనే వదిలేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు

హోసూరు, ఆగస్టు 19: కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో అనుమతి లేని బోర్డులు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న పలు కట్టడాలను సోమవారం మున్సిపల్ అధికారులు తొలగించారు. ఇటీవల హోసూరు కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన వారపు సమీక్షా సమావేశాల్లో అనుమతి లేని దుకాణాలు, బోర్డులను తొలగించాలని నిర్ణయించారు. వీధి వ్యాపారుల అక్రమణలు, వాహనాల పార్కింగ్ వల్ల ట్రాఫిక్ రద్దీని తొలగించాలని సంబంధిత వ్యక్తులకు కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే లేక్‌స్ట్రీట్, పాత బెంగళూరు రోడ్డు, తాలూకా కార్యాలయం రోడ్డు, హోసూరు హస్పిటల్ రోడ్డు, రాయకోట రోడ్డు, ఎంజీ రోడ్డు, నేతాజీ రోడ్డు , బాగలూరు రోడ్డు, హోసూరు బస్టాండు ఔటర్ రింగ్ రోడ్డు, తళి ఫ్లైఓవర్ వరకు వాసన్ ఐకేర్ నుంచి మహాలక్ష్మీ నగర్ జంక్షన్ వరకు ఆక్రమణలను అధికారులు, పోలీసుల రక్షణతో తొలగించారు.



నోటీసులు అందిస్తున్న అధికారులు

గ్రీవెన్స్ డేలో భారీగా వినతులు

హోసూరు(కృష్ణగిరి), ఆగస్టు 19: కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పీపుల్స్ గ్రీవెన్స్ డేస్ సమావేశం జిల్లా కలెక్టర్ సరయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధికారి ఇళ్ల పట్టాలు, ఉచిత కుట్టుమిషన్లు, వృద్ధాప్య పించన్ లబ్ధిదారులకు అందజేశారు. మహిళా హక్కుల భృతి, రోడ్డు సౌకర్యం, విద్యుత్ కనెక్షన్ వంటి పలు డిమాండ్లపై ప్రజల నుంచి 563 వినతి పత్రాలు అందాయని అధికారులు తెలిపారు. అర్హులైన వినతిపత్రాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అనర్హత వినతి పత్రాలను పిటిషనర్‌లకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ తన ఆయ శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారి వికలాంగుల సంక్షేమ శాఖ తరఫున 26 మంది దృష్టిలోపం ఉన్న వారు, 29 మంది బధిరులకు , 55 మంది దివ్యాంగులకు రూ.7 లక్షల 34 వేల 195 విలువైన పరికరాలను అందజేశారు. జిల్లా రెవిన్యూ అధికారి సాధనకురళ్, ప్రత్యేక సహాయ కలెక్టర్ పన్నీర్ సెల్వం, జిల్లా వెనుకబడిన సంక్షేమ శాఖ అధికారిణి పద్మలత, జిల్లా కలెక్టర్ మురుగేశన్ సహ అన్ని శాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న కలెక్టర్



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రశాంత్ బాబు

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

హోసూరు(సిఫ్‌కాట్), ఆగస్టు 19: పట్టణంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెల్మెట్ ప్రాధాన్యతను వివరిస్తూ ఫొటోగ్రాఫర్లు సోమవారం ద్విచక్ర వాహన ర్యాలీ చేపట్టారు. పట్టణంలోని వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. హోసూరు డీఎస్పీ బాబు ప్రశాంత్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ పాత బెంగళూరు రోడ్డు, మహాత్మాగాంధీ రోడ్డు, రాయకోట్టై రోడ్డు, డెంకణీకోట రోడ్డు మీదుగా కార్పొరేషన్ పార్కుకు చేరుకుంది. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో పుట్టిన పిల్లలకు , రోగులకు ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నిర్వాహకులు, సభ్యులు తరఫున సంక్షేమం సహాయం అందజేశారు. ఫొటోగ్రాఫర్‌లకు గుణం ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. వాసన్ ఐకేర్ ఆసుపత్రి వారు కంటి చికిత్స అందించారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

●ఐదుగురి అరెస్టు.. 39 మందిపై కేసు నమోదు

రాయచూరు, ఆగస్టు 19: జిల్లాలోని సింధనూరు తాలూకా తుర్విహాళ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో సోమవారం పోలీసులు పేకాట స్థావరాల పై మెరుపుదాడులు నిర్వహించారు. మూడు వేర్వేరు చోట్ల జరిపిన దాడుల్లో మొత్తం 39 మంది పై కేసు నమోదు చేయగా వారిలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ డీవీ సుజాతా తెలిపారు. ఈ దాడుల్లో దాదాపు రూ.2లక్షలకు పైగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కొంతకాలంగా గాంధీనగర్ పరిసరాల్లో పెద్ద ఎత్తున పేకాట సాగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులకు దిగారు. పోలీసుల దాడులతో పట్టణంలో జూదర్లు బెంబేలెత్తారు.

నులి చందయ్య జయంత్యుత్సవం



ప్రవచనకారుడు నులిచందయ్యకు నివాళి అర్పిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, ఆగస్టు 19: నగరంలోని జోలదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో ప్రఖ్యాత వచనకారుడు నులి చందయ్య జయంత్యుత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. లెదర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధ్యక్షుడు ముండ్రగి నాగరాజు తదితరులు నులిచందయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ పన్నెండవ శతాబ్దపు వచనాకారులలో ఒకరైన నులిచందయ్య వచనాల ద్వారా ధార్మిక, సామాజిక ఆలోచనలను తెలియజేశారన్నారు. ఆయన సామాన్య ప్రజలకు అధ్యాత్మిక అవగాహన కల్పించారన్నారు. సమాజంలో కులవ్యవస్థతో పాటు అన్యాయాలపై గళం విప్పిన ఘనత ఆయనదేనన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు హనుమంతప్ప మాట్లాడుతూ నులి చందయ్య సమాజంలో గొప్ప కాయక యోగి. వృత్తిపట్ల ఎంతో గౌరవం కలిగి ఉండేవారన్నారు. నేటి తరం అజ్ఞానం నుంచి బయటపడి శరణుల అధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కన్నడ సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నాగరాజు, జిల్లా కులువ మహాసంఘం జిల్లా అధ్యక్షుడు శంకరబండే వెంకటేశ్‌తో పాటు సంఘం నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సిరుగుప్ప : శివశరణుల తత్వ సిద్ధాంతాలను అందరూ పాటించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీఎం సతీష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని సీడీపీఓ భవనంలో తాలుకా సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నులి చందయ్య917వ జయంతిని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు.ఈ సందర్భంగా తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ వడ్డేరు సిద్దప్ప, బీసీ సంక్షేమ శాఖ అధికారి గాదెలింగప్ప, శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థ, ప్రజలు పాల్గొన్నారు.


అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలు ఏకగ్రీవం

కంప్లి, ఆగస్టు 19 : తాలుకా పరిధిలోని మెట్రి గ్రామ పంచాయతీ అధ్యక్ష ఉపాధ్యక్ష ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. 19 మంది సభ్యులు వుండగా అధ్యక్ష స్థానానికి గుండమ్మ, ఉపాధ్యక్ష స్థానానికి గిరీష నామినేషన్లు వేశారు. ఎవరూ పోటీలో లేనందువలన వారిద్దరినే అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు కంప్లి తాలుకా అధికారి శ్రీకుమార్ తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, సభ్యులను గ్రామస్థులు అభినందించి సన్మానించారు. కార్యదర్శి శ్రీశైల గౌడ, గ్రామ ప్రముఖులు, పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంమ్...

నారాయణ గురు (జయంతి)



కేరళకు చెందిన సంఘ సంస్కర్త నారాయణ గురు 1856 ఆగస్టు 20న ట్రావెన్‌కోర్ ప్రాంతంలో జన్మించారు. సమాజంలోని మూఢ విశ్వాసాలను, కులతత్వాన్ని నిరసించారు. కులం కారణంగా కొన్ని వర్గాలకు చెందిన ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని, వారికి ఆధ్యాత్మిక స్వేచ్ఛ, సామాజిక స్వాతంత్ర్యం ఉండాలని భావించారు. వారిని ఉద్ధరించడానికి ఆల యాలు, పాఠశాలలు మొదలైనవి నెలకొల్పేందుకు పాటు పడ్డారు. సంస్కృతం, జ్యోతిష్యం, ఆయుర్వేదంలోనూ ప్రవేశం ఉండేది. ప్రజలలో చైతన్యం తెచ్చేం దుకు ఎంతో కృషి చేశారు. 1928 సెప్టెంబరు 20న కన్నుమూశారు. 1986లో ఆయన పేరిట ఒక సినిమా వచ్చింది. నేటికీ ఆయన తరఫు సంఘాలు ఇతోధికంగా కృషి చేస్తున్నాయి.

పద్మనాభం (జయంతి)



తెలుగు సినీరంగంలో తనదైన గుర్తింపు పొందిన పద్మనాభం 1931 ఆగస్టు 20న కడప జిల్లా పులివెందుల తాలూకా సింహాద్రిపురంలో జన్మించారు. పూర్తి పేరు బసవరాజు వెంకట పద్మనాభ రావు. రంగస్థల నటుడి నుంచి వెండి తెరకు పరిచయమయ్యారు. సినీ నిర్మాత, దర్శకుడిగాను వ్యవహరించారు. జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాల్లో వివిధ పాత్రల్లో సుమారు 400 సినిమాల్లో నటించారు. నంది అవార్డు, అల్లు రామలింగయ్య నేషనల్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2010 ఫిబ్రవరి 20న కన్నుమూశారు.

రాజీవ్‌గాంధీ (జయంతి)



రాజీవ్‌గాంధీ 1944 ఆగస్టు 20న ముంబైలో జన్మించారు. దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ మనవడు, ఇందిరాగాంధీ కుమారుడు. కాంగ్రెస్ పార్టీలో కీలక హోదాలలో కొనసాగారు. తల్లి హత్యానంతరం పిన్నవయస్సులోనే అనగా 40వ యేట ప్రధానమంత్రి అయ్యారు. ఆరవ ప్రధానిగా 1984 నుంచి 1989వరకు కొనసాగారు. దేశం ఆధునిక దిశగా సాగేందుకు పలు బాటలు వేశారు. శ్రీపెరంబుదూరులో 1991 మే 21న హత్యకు గుర య్యారు. మరణానంతరం ఆయనకు అత్యున్నత 'భారతరత్న' ప్రకటించారు. ఆయన సతీమణి సోనియాగాంధీ కాంగ్రెస్ పార్టీలో కీలకహోదాలో కొనసాగుతున్నారు.

వి.రామకృష్ణ (జయంతి)



అపర ఘంటసాలగా పేరొందిన విస్సంరాజు రామకృష్ణ దాసు 1947 ఆగస్టు 20న జన్మించారు. 1970వ దశకంలో పేరొందిన తెలుగు సినిమా నేపథ్య గాయకుడు. 20 సంవత్సరాల సినీ జీవితంలో 200 సినిమాలలో ఐదువేలకుపైగా పాటలు పాడారు. తాతా మనవడు, భక్త తుకారాం, అల్లూరి సీతారామరాజు, దానవీర శూరకర్ణ తదితర సినిమాలలో ఆయన పాటలు పాడారు. ఎక్కువగా కేవీ మహదేవన్, పెండ్యాల వంటి సంగీత దర్శకులతో పనిచేశారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్ బాబు, కృష్ణంరాజు తదితర నటులకు పాటలు పాడారు. తన సుమధుర గాత్రంతో అపర ఘంటసాలగా పేరొందిన ఆయన 2015 జూలై 16న కన్నుమూశారు.

బీకేఎస్ అయ్యంగార్ (వర్ధంతి)



యోగా గురువు 'పద్మ విభూషణ్' గ్రహీత బెళ్లూరు కృష్ణమాచార్ సుందరరాజ అయ్యంగార్ 1918 డిసెంబరు 14న కోలారు ప్రాం తంలో జన్మించారు. యోగాలో ఆయన ప్రవేశపెట్టిన పద్ధతులు 'అయ్యంగార్ యోగా'గా పేరొందాయి. ఆధునిక యోగా పితామహగా పేరొందిన తిరుమలై కృష్ణమాచార్య వద్ద విద్యాభ్యాసం చేశారు. యోగా, ఫిలాసఫీపై పలు పుస్త కాలు రాశారు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ పురస్కారాలు పొందారు. 2014 ఆగస్టు 20న కన్నుమూశారు.

బడ్జెట్‌లో రైల్వేకు అరకొర నిధులు

కేటాయింపులపై పింక్ బుక్ విడుదల చేసిన రైల్వే బోర్డు



గుంతకల్లు రైల్వేస్టేషన్

గుంతకల్లు, ఆగస్టు 19: కేంద్ర ప్రభుత్వం గత నెలలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తమ శాఖకు కేటా యింపులపై రైల్వేబోర్డు పింక్ బుక్‌ను ఆలస్యంగా విడుదల చేసింది. జోన్‌ల వారీగా పింక్‌బుక్‌ను రిలీజ్ చేసింది. దక్షిణ మధ్య రైల్వే కు విడుదలైన నిధుల్లో గుంతకల్లు డివిజన్‌కు అరకొరగా ఫండ్స్ వచ్చాయి.

రైల్వే డివిజన్‌కు వచ్చిన నిధులివే..

డివిజన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న నడికుడి-శ్రీకాళహస్తి లైన్‌కు మధ్యంతర బడ్జెట్‌లో రూ. 310 కోట్లు కేటాయించగా, ఆ మొత్తాన్ని జూలై బడ్జెట్‌లో రూ. 450 కోట్లకు పెంచారు. కడప- బెంగళూరు కొత్త లైన్‌కు ఇంటీరియం బడ్జెట్‌లో నిధులు ఇవ్వకపోగా, జూలై బడ్జెట్‌లో రూ.10 కోట్లు ఇచ్చారు. గుత్తి-ధర్మవరం లైన్ బకాయిల కోసం రూ.100 కోట్లు కేటాయించారు. నిర్మాణంలో ఉన్న గుంతకల్లు-గుంటూరు లైన్‌కు ఫిబ్రవరి బడ్జెట్‌లో రూ.283 కోట్లను కేటాయించగా దాన్ని రూ.480 కోట్లకు పెంచారు. రేణిగుంట, వాడి, గుత్తి బైపాస్ లైన్ల బకాయిల కింద ఫిబ్రవరి బడ్జెట్‌లో కేటాయించిన రూ. 83.30 కోట్లను, జూలై బడ్జెట్‌లో యథాతథంగా కేటాయించారు. అకోలా-డోన్ కొత్త లైన్‌కు, ధర్మవరం-పాకాల-కాట్పాడి డబ్లింగ్ పనులకు రెండు బడ్జెట్లలోనూ నిధులు ఇవ్వలేదు. గుత్తి-పెండేకల్లు డబ్లింగ్‌కు ఇంటీరియం బడ్జెట్‌లో రూ. 150 కోట్లను కేటాయించగా పూర్తి స్థాయి బడ్జెట్‌లో రూ. వంద కోట్లు కోతపెట్టారు. తిరుపతి శాటిలైట్ స్టేషన్‌కు రూ. 7.41 కోట్లను కేటాయించారు. ఇవికాక ట్రాక్ రెన్యువల్స్, ఆర్‌యూబీలు తదితర పనులకు నిధుల కేటాయింపులు జరిగాయి. వీటిలో డివిజన్‌కు నికరంగా ఏమేరకు నిధులు లభించాయో రైల్వే అధికారులు వెల్లడించాల్సి ఉంది.

గవర్నర్ చర్య రాజకీయ ప్రేరేపితం

- మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్
- పలు చోట్ల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు



నిరసనలో పాల్గొన్న మంత్రి సుధాకర్, ఎమ్మెల్సీ సీతారాం తదితరులు

చిక్కబళ్ళాపుర, ఆగస్టు 19: ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతులు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకం, రాజకీయ ప్రేరేపితమని ఉన్నత విద్యాశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ ఆరోపించారు. జిల్లాకేంద్రమైన చిక్కబళ్ళాపురలో సోమవారం కాంగ్రెస్ పిలుపుతో గవర్నర్‌కు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. మంత్రి సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు అనుమతించిన గవర్నర్ చర్య హాస్యాస్పదమని, ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు బీజేపీ, జేడీఎస్‌లు కుట్ర పన్నుతున్నాయన్నారు. నాలుగు దశాబ్దాలకుపైగా స్వచ్ఛమైన మచ్చలేని నేతను ఇరికించారన్నారు. నిరసనలో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఎంఆర్ సీతారాం, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎస్ రక్షారామయ్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేశవరెడ్డి, మాజీ మంత్రి మునియప్ప, మాజీ ఎమ్మెల్యే కేపీ బచ్చేగౌడ, నాయకులు మునేగౌడ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ తీరుపై నిరసనలు

బంగారపేట: ముఖ్యమంత్రి సిద్దరామయ్యపై గవర్నర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతించడాన్ని ఖండిస్తూ కాం గ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగాయి. కర్ణాటక నగర మౌలిక సదుపాయాలు, అభివృద్ధి మండలి అధ్యక్షుడు, ఎమ్మెల్యే నారాయణ స్వామి నేతృత్వంలో సోమవారం పట్టణంలో నిరసన సాగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రం చేతిలో గవర్నర్ కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. సీఎం సిద్దరామయ్యపై ప్రాసిక్యూషన్‌కు అనుమతించడం ప్రజా ప్రభుత్వాన్ని, రాజ్యాంగాన్ని అవమానించడమేనని ఆక్రోశం వ్యక్తం చేశారు. బీజేపీయేతర పార్టీలు పాలనలో ఉన్న రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందన్నారు. రాజ్‌భవన్‌ను దుర్వినియోగం చేస్తోం దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ, జేడీఎస్ నాయకులు కొంత మంది కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాఖండ్, జార్ఖండ్, న్యూఢిల్లీ తరహాలో కర్ణాటకలోనూ కుట్రకు యత్నిస్తున్నారన్నారు. గవర్నర్ తీరు ఏకపక్షంగా ఉందని ఆరోపించారు. టైర్లకు నిప్పుపెట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్య క్రమంలో నగరాభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు గోపాల రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాలగౌడ, బూదికోటె బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కేవీ నాగరాజ్, కాంగ్రెస్ సీనియర్ ప్రముఖులు పార్థసారథి, నంజప్ప, నగర బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందు కుమార్, పురసభ సభ్యులు షంషుద్దీన్ బాబు, షఫీ, వెంకటేశ్, గోవింద, రత్నమ్మ, గంగమ్మ, సుహేల్, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.





బంగారపేట నిరసనలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు

విజయపురలో...

విజయపుర: దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు చేరుకున్నారు. కేపీసీసీ కార్యదర్శి వీ మంజునాథ్ నేతృత్వంలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజారంజక పథకాలు, కార్యక్రమాలను సహించలేని బీజేపీ, జేడీఎస్‌లు సీఎంకు వ్యతిరేకంగా తప్పుడు ఫిర్యాదులు చేసి గవర్నర్‌నుంచి ప్రాసిక్యూషన్‌కు అనుమతులు వచ్చేలా చేశారని మండిపడ్డారు. బెంగళూరు గ్రామీణ జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగం అధ్యక్షుడు ముబారక్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల చట్టం 17ఎ ప్రకారం ముఖ్యమంత్రిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతించారని మండిపడ్డారు. రాజ్‌భవన్ అధికారాన్ని దుర్వినియోగం చేశారన్నారు. అనంతరం జిల్లా కార్యాల యానికి చేరుకున్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, పురసభ సభ్యుడు రాజణ్ణ, నారాయణస్వామి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామచంద్రప్ప, తేజస్ మంజునాథ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



విజయపురలో కాంగ్రెస్ కార్యకర్తలు

డాక్టర్ చీటీ లేకుండా మందులు ఇవ్వరాదు



సమావేశంలో మెడికల్‌షాపు వ్యాపారుల క్షేమాభివృద్ధి సంఘం పదాధికారులు

దొడ్డబళ్లాపుర, ఆగస్టు 19: నిపుణులైన వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎటువంటి ఔషధాలు, రోగనిరోధక మాత్రలు ఇవ్వరాదని ఔషధ వ్యాపారుల క్షేమాభివృద్ధి సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు, తాలూకా సంఘం సంస్థాపక అధ్యక్షుడు ఎస్‌సి పటేలయ్య అభిప్రాయపడ్డారు. కొన్ని ఔషధాలకు మాత్రమే మినహాయింపు ఉంటుందని, చాలా పాత ప్రిస్క్రిప్షన్‌ల మందులు కూడా డాక్టర్ సూచన లేకుండా ఇచ్చే అవకాశం ఉండదని అన్ని మెడికల్ షాపుల విక్రయదారులు పాటించాలని మీడియా సమావేశంలో తెలిపారు. సోమవారం ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మండ్య జిల్లాలో భ్రూణ హత్య కేసు వెలుగు చూశాక జిల్లా సహాయక ఔషధ నియంత్రణ అధికారులు పలు సలహా సూచనలు చేశారన్నారు. ఎప్పుడైనా తనిఖీలు చేసే వీలుందని నియమాలను ఉల్లంఘించరాదని లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయన్నారు. భ్రూణ హత్యకేసులు, డెంగీ కేసుల నియంత్రణలో మెడికల్ షాపు వ్యాపారుల పాత్ర కీలకమన్నారు. ఎంటిపి కిట్, ఎన్‌డిపిఎస్, రోగ నిరోధక ఔషధాలను డాక్టర్ చీటీ లేకుండా ఇవ్వరాదన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు డిఎస్ సిద్దణ్ణ, కార్యదర్శి టి.డి.శ్యామసుందర మాట్లాడుతూ తాలూకాలో 150 మెడికల్‌షాప్‌లు ఉన్నాయని నిబంధనలు పాటించాలని సూచించారు. కాగా ప్రభుత్వ నియమాలు ఆన్‌లైన్ వ్యాపారాలకు కూడా అన్వయించాలని అభిప్రాయపడ్డారు. జనరిక్ మెడికల్ షాపుల్లో ప్రభుత్వ రాయితీలో విక్రయించే మందులు మినహా ఇతరత్రా విక్రయించరాదని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం కోశాధికారి రహీం, సంఘం ప్రముఖులు జనీశ్, జగన్నాథ్, హేమంత్‌కుమార్, చంద్రణ్ణ, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫౌండర్స్ డే

బెంగళూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఇఎల్‌వి గ్రూప్ సంస్థాపకుడు, ఛైర్మన్ డాక్టర్ భాస్కర్ పుట్టినరోజును ఫౌండర్స్ డే 2024గా ఉత్సాహంగా జరిపారు. వర్తూరులోని ప్రాడిజీస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం సాయంత్రం పలు కార్యక్రమాలు సాగాయి. ప్రతి పుట్టినరోజును సేవా మనోభావంతో సమాజంకోసం ఏదైనా చేయాలనే ఉద్దేశ్యంతో ఉన్న డాక్టర్ భాస్కర్ ఈసారి పేదలకు ఉచిత నీటి ట్యాంకర్ సదుపాయాన్ని కల్పించారు. అంతేకాకుండా రాష్ట్రంలో మట్టి చరియలతో కుంగిపోయిన ప్రాంత వాసులకు, కేరళ బాధితులకు సాయం అందచేశారు. గత ఏడాది ఉచిత అంబులెన్స్ సేవలను ప్రారంభించిన సంగతి విదితమే. ఇదే రీతిన మరిన్ని సామాజిక సేవలు అందిస్తామని డాక్టర్ భాస్కర్ వెల్లడించారు. కార్యక్రమంలో 1500మందికిపైగా ఇఎల్‌వి గ్రూప్ సిబ్బంది, స్నేహితులు, శ్రేయోభిలాషులు పాల్గొని భాస్కర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఫౌండర్స్ డేలో కేక్ కట్ చేస్తున్న డాక్టర్ భాస్కర్

ఉల్లూరుపేటలో డెయిరీ ప్రారంభం

శిడ్లఘట్ట, ఆగస్టు 19: పట్టణంలోని 13వ వార్డు ఉల్లూరుపేటలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం నూతన డెయిరీ భవనాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకుడు పుట్టు ఆంజినప్ప మాట్లాడుతూ పాడిరైతులకు అనుకూలంగా ఇక్కడ డెయిరీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇటీవల డెయిరీకి అధ్యక్షులు ఎన్నికయ్యారు. పాల సహకార సంఘం అధ్యక్ష, పాలకవర్గం డైరెక్టర్‌లు కలసికట్టుగా సంఘాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ ప్రముఖుడు సీకల్ రామచంద్రగౌడ మాట్లాడుతూ పాలడెయిరీతో చుట్టుపక్కలవారికి అనుకూలం కానుందన్నారు. సంఘం అధ్యక్షుడు పురుషోత్తమ్, మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, సీకల్ ఆనందగౌడ, ఎస్సై వేణుగోపాల్, నరేశ్, చాతుర్య, కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తేజస్, డైరెక్టర్‌లు కిరణ్‌కుమార్, నారాయణస్వామి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



డెయిరీ ప్రారంభంలో ప్రముఖులు

200 మంది రుత్వికులతో రుద్రపారాయణం



రుద్రపారాయణలో పాల్గొన్న రుత్వికులు

బాగేపల్లి, ఆగస్టు 19: పట్టణంలోని శంకరమఠం, గడిదం గాయత్రి సముదాయ భవనంలో బెంగళూరు రుద్రబళగ, బాగేపల్లి బ్రాహ్మణ మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం 200 మంది రుత్వికులతో రుద్రపారాయణం నిర్వహించారు. శ్రావణపూర్ణిమ నేపథ్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు సాగాయి. అత్యంత భక్తిశ్రద్ధలతో సాగిన రుద్ర పారాయణంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా బెంగళూరు నుంచి శేషగిరిబాబు, భీమేశ్, రఘు, తాలూకా బ్రాహ్మణసంఘం మహాసభ అధ్యక్షుడు మునిరామయ్య, కార్యదర్శి ఎన్ నాగరాజు, వైఎన్ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్థవంతంగా శ్రావణపూర్ణిమ

చేళూరు, ఆగస్టు 19: శ్రావణ పూర్ణిమను పురస్కరించుకుని తాలూకా కేంద్రమైన చేళూరులో సోమవారం సామూహిక ఉపాకర్మ నిర్వహించారు. బ్రాహ్మణసంఘం భవనంలో ఉదయం 10 గంటలనుంచి ఉపాకర్మ కార్యక్రమాలు సంఘం అధ్యక్షుడు నాగభూషణస్వామి నేతృత్వంలో సాగాయి. శ్రావణపూర్ణిమ రోజున నూతన జంధ్యాలను శాస్త్రోక్తంగా ధరించే సంప్రదాయం ఉంది. తాలూకాలోని గ్రామాలనుంచి బ్రాహ్మణులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సంఘం సభ్యులు మూర్తి, నాగరాజు, రాఘవేంద్ర, ఇంద్రజాలం రాఘవేంద్ర పాల్గొన్నారు.



ఉపాకర్మలో పాల్గొన్న బ్రాహ్మణులు

కొళ్లేగాలలో దంపతుల ఆత్మహత్య

- ఐదు పేజీల డెత్‌నోట్ - 16మందిపై ఆరోపణలు



నాగేశ్, సత్యలక్ష్మి దంపతులు (ఫైల్)

బెంగళూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తీర్చలేని దంపతులు ఐదు పేజీల సమగ్ర వివరాలతో వేధిం పులకు పాల్పడిన 16మంది పేర్లను ప్రస్తావించి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చామరాజనగర జిల్లా కొళ్ళేగాలలో చోటు చేసుకుంది. నారాయణస్వామి గుడి వీధి నివాసి పీఆర్ నాగేశ్ (56), భార్య సత్యలక్ష్మి (46)లు ఆత్మహత్యకు పాల్పడినవారు. నాగేశ్ కొన్నేళ్లకాలంగా వివిధ ఏజెన్సీల ద్వారా వ్యాపారాలు చేసేవారు. హోల్‌సేల్ వ్యాపారం చేసేందుకై 30 లక్షల రూపాయలు పలువురితో అప్పు తీసుకున్నారు. వాపసు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో అప్పులు ఇచ్చినవారి నుంచి వేధింపులు పెరిగాయి. అప్పులు ఇచ్చినవారు నిత్యం వారిని దూషించేవారని తెలుస్తోంది. కొన్నిరోజులపాటు దంపతులు మైసూరులోని బంధువుల ఇంట్లో గడిపారు. ఈనెల 17న ఇంటికి వచ్చి ఐదు పేజీల డెత్‌నోట్ రాసి కుమారుడికి వాయిస్ మెసేజ్ పంపారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు ఇంట్లోనే ఇద్దరూ ఉరి వేసుకున్నట్టు తెలుస్తోంది. కుమారుడు గణేశ్‌నాగ్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పులు ఇచ్చి వేధింపులకు పాల్పడినవారిలో ఇక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ మేనేజర్ ఆనంద్, బసవలింగప్ప, మహాదేవస్వామితోపాటు పలువురి పేర్లను డెత్‌నోట్‌లో ప్రస్తావించినట్టు తెలుస్తోంది.

ఐఏబీ సమావేశం తర్వాతే నీటి విడుదల

- ఛైర్మన్, కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 19: ఐఏబీ సమావేశంలో చర్చించి హెచ్‌ఎల్‌ఎంసీ, జీబీసీ, ఎంపీఆర్ సౌత్‌కెనాల్, నార్త్‌కెనాల్ కింద ఆయకట్టుకు దామాషా పద్ధతిలో విడుదల చేయనున్నట్లు ఐఏబీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. హెచ్చెల్సీకి, జిల్లాకు 2024-25 సంవత్సరానికి సంబంధించి టీబీ డ్యాం నుంచి 26.368టీఎంసీల నీటిని కేటాయించినట్లు ఐఏబీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 10టీఎంసీల నీరు తాగునీటి అవసరాలకు, మిగిలిన నీరు వ్యవసాయం, కాలువలకు దామాషా పద్ధతిలో కేటాయించ నున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఈనెల 10నుంచి హెచ్‌ఎల్‌ఎంసీ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న తాగునీటి పథకాలు, నారు మడులు, ఆయకట్టు రైతుల అవసరాలు, ఆయా ఉపకాలువలకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు.

రేపు ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

అనంతపురం టౌన్, ఆగస్టు 19: జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు రెవెన్యూ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తామని వెల్లడించారు.

కూలీల వాహనం బోల్తా: 16మందికి గాయాలు

ధర్మవరం రూరల్,(కనగానపల్లి), ఆగస్టు 19: బొలెరో వాహనం బోల్తాపడి 16మంది కూలీలు గాయపడిన సంఘటన సోమవారం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్ద జరిగింది. మామిళ్లపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పెద్దన్న పొలంలో పని చేయడానికి ధర్మవరం మండలం పోతుకుంట, గుట్టకిందపల్లి గ్రా మాలకు చెందిన దాదపు 20మంది మహిళా కూలీ లు బొలెరో వాహనంలో వచ్చారు. పనులు ముగించుకుని మధ్యా హ్న సమయంలో అదే వాహనంలో మామిళ్లపల్లి నుంచి పోతుకుంటకు బయల్దేరా రు. అయితే మామిళ్లపల్లి సమీపంలోనే వాహనం స్టీరింగ్ విరిగి పోయి అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. దీంతో వాహనం లో ఉన్న కూలీలు చల్లాచెదురుగా పడిపోయారు. పోతుకుంటకు చెందిన పెద్దక్క, రామక్క, ఈరమ్మ, కళ్యాణి, ముత్యాలమ్మ, రామలక్ష్మి, గంగరత్న, సరస్వతి, అరుణ, నాగరత్న, గుట్టకిందపల్లికి చెందిన రామాంజినమ్మ, మల్లేశ్వరి, కుర్లపల్లి తండాకు చెందిన నారాయణనాయక్, లక్ష్మీనాయక్, బాలకృష్ణనాయక్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108ద్వారా క్షతగాత్రులను ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో పోతుకుంటకు చెందిన ముత్యాలమ్మ, అరుణలను మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.





బోల్తాపడిన బొలెరో వాహనం, తీవ్రంగా గాయపడి ప్రమాదస్థలం వద్ద రోదిస్తున్న మహిళా కూలీలు

బాధితులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ పరామర్శ

వాహనం బోల్తాపడి తీవ్రంగా గాయపడ్డ కూలీల ను ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పరామర్శించారు. గాయపడ్డ కూలీల ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.